# “ఈశ్వరాంబా సాధ్వి ఎత్తి పెంచుట కదా సత్యనారాయణునకు విశ్వఖ్యాతి కలిగె”

సత్య ధర్మ ప్రేమ శాంతులు లేకున్న
విద్యలన్నియు నేర్చిన విలువసున్న
సత్య ధర్మ ప్రేమ శాంతులు లేకున్న
దాన ధర్మాల సార్థకత సున్న
సత్య ధర్మ ప్రేమ శాంతులు లేకున్న
పదవులనేలిన ఫలము సున్న
సత్య ధర్మ ప్రేమ శాంతులు లేకున్న
బహుళ సత్కార్యలాభంబు సున్న
ఈ సనాతన ధర్మహర్మ్యంబు నిలువ
గుణములియ్యవి నాల్గు పునాది గోడలప్ప
ఇంతకన్నను వేరెద్ది ఎరుక పరతు
సాధు సద్గుణ గణ్యులౌ సభ్యులార!

*ప్రేమస్వరూపులారా!*

సత్య, ధర్మ, శాంతి, ప్రేమలనే నాల్గు గుణములపైననే మానవజీవిత సౌధము ఆధారపడి ఉన్నది. ఇవి భద్రముగా లేకుండిన జీవిత సౌధము క్షణంలో కూలి పోతుంది. ప్రాచీనకాలమునుండి భారతీయ సంస్కృతి ఈ నాల్గు గుణములపైననే ఆధారపడి నడుస్తున్నది. ఈనాడుకూడా మానవులు కొంతవరకైనా సత్య, ధర్మ, శాంతి, ప్రేమలను ఆధారము చేసుకోవడంచేతనే ఇంతమాత్రమైనా ప్రశాంతంగా జీవించగల్గుతున్నారు.

srisathyasaivachanamrutam

జిజియాబాయి ఇట్టి గుణములపై ఆధారపడి పోషించడం చేతనే ఆమె కుమారుడైన శివాజీ గొప్ప వీరుడై పేరుగాంచినాడు. కౌసల్యయొక్క పవిత్ర గుణములవలననే రాముడు దేవుడై కీర్తింపబడినాడు. సీతామహాసాధ్వి గుణప్రభావముచేతనే ఆమె పుత్రులైన కుశలవులు మహావీరులై ఘనతకెక్కినారు. పుత్లీబాయి సద్గుణములవలననే గాంధీ మహాత్ముడై ఖ్యాతి నొందినాడు. కనుక, వ్యక్తి జీవితము తల్లిదండ్రులయొక్క గుణములపైననే ఆధారపడియున్నది. కాని, ఈనాడు కొందరు తల్లిదండ్రులను అలక్ష్యంగా చూస్తున్నారు. వారి గుణములకు, ప్రభావమునకు కించిత్తైనా విలువనివ్వడం లేదు.

పుత్లీబాయి ఒక నియమాన్ని పాటించేది. కోయిల కూత వినకుండా ఆమె భోజనం చేసేది కాదు. గాంధీ పసివానిగా ఉన్నప్పుడు ఒకరోజు మధ్యాహ్నం మూడు గంటలైనప్పటికీ తల్లి భోజనం చేయకుండా ఉండడం చూసి ఒక యుక్తి పన్నాడు. తాను ఇంటి వెనుకకు పోయి కోయిలమాదిరి కూత పెట్టాడు. వెంటనే లోపలికి వచ్చి, "అమ్మా! కోయిల కూసింది. ఇంక, నీవు భోజనం చేయవచ్చు," అన్నాడు. తన కుమారుడు అబద్ధం చెబుతున్నాడని గ్రహించి ఆ తల్లి పట్టలేని కోపంతో గాంధీని చెవిపట్టి యీడ్చి రెండు చెంపదెబ్బలు కొట్టింది. "నీలాంటి అసత్యవాది నా గర్భంలో పుట్టడం నా దురదృష్టం," అంటూ చాలా బాధపడింది. అప్పుడు గాంధీ పశ్చాత్తాపపడి తన తప్పును క్షమించవలసిందిగా తల్లిని ప్రార్థించాడు. ఇక జీవితంలో ఎన్నడూ తాను అసత్యమాడనని ప్రతిజ్ఞ చేశాడు.

ఈవిధంగా ప్రాచీనకాలమునుండి భారతదేశంలో తల్లియొక్క గుణగణముల ప్రభావముచేత, ఉత్తమమైన శిక్షణచేత ఎంతోమంది వ్యక్తులు మహనీయులుగా రూపొందుతూ వచ్చారు. కాని, ఈనాటి పిల్లలు ఆడే ఆటల్లో, పాడే పాటల్లో, చెప్పే మాటల్లో అసత్యము చేరిపోవటంచేత దేశము అనేక కష్టాలనెదుర్కోవలసి వస్తున్నది. పిల్లలకు తల్లిదండ్రులు ఇచ్చే శిక్షణపైననే దేశముయొక్క మంచిచెడ్డలు ఆధారపడి ఉంటాయి. తల్లిదండ్రులు సత్యమార్గమును అనుసరించినప్పుడే బిడ్డలు కూడా సత్యమార్గమునందు ప్రవేశిస్తారు.

sri sathyasaivachanamrutam

**మానవాకృతిని దైవావిర్భావము**

ప్రాచీన భారతీయ స్త్రీలు ప్రతి పౌర్ణమినాడు సత్యనారాయణ వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో ఆచరించేవారు. అదేవిధముగా, ఈ శరీరమునకు తల్లియైన ఈశ్వరమ్మకూడా ప్రక్కింటి సుబ్బమ్మతో చేరి ప్రతి పౌర్ణమినాడు సత్యనారాయణ పూజ చేస్తూ, సత్యనారాయణ వ్రత కథను వింటూ వచ్చింది. ఒకనాడు సుబ్బమ్మ ఇంట్లో వ్రతము పూర్తయ్యేసరికి చాలా ఆలస్యమైంది. అంతవరకు ఈశ్వరమ్మ భోజనం చేయలేదు. "ఈ సత్యనారాయణ పూజ నిమిత్తమై ఇన్ని నిబంధనలా?" అని ఇంట్లో అందరూ విసుగుచెందారు. ఆమె భర్త పెద్ద వెంకమరాజుకూడా ఆమె పట్టుదలను ఖండించాడు. "మీకు ఆకలైతే భుజించండి, నాకు ఆకలిగాలేదు. సత్యనారాయణ వ్రతప్రసాదం తీసుకున్న తరువాతనే భోజనం చేస్తాన"ని ఈశ్వరమ్మ పట్టుపట్టింది. సుబ్బమ్మ వ్రతము పూర్తిచేసి ప్రసాదము తెచ్చి ఈశ్వరమ్మకు అందించింది. ఆ ప్రసాదమును భుజించిన తరువాతనే ఈశ్వరమ్మకు గర్భము నిల్చింది. "యద్భావం తద్భవతి." మానవునియొక్క స్థితిగతులు అతని సంకల్పములపైనే ఆధారపడి ఉంటాయి. ఈశ్వరమ్మ ఒక్క అక్షరము కూడా చదువుకోలేదు. ఐతే, ఆమెకు భగవంతునిపై అచంచలమైన భక్తి, విశ్వాసములు ఉండేవి. ఏడవనెలలో ఒకనాడు సుబ్బమ్మ ఇంటికి వచ్చి, "ఈశ్వరమ్మా! నీవు సత్యనారాయణ వ్రతప్రసాదమును భుజించిన తరువాతనే నీకు గర్భము నిల్చింది. కాబట్టి, నీకు పుట్టబోయే కుమారునికి సత్యనారాయణుడని పేరు పెట్టు," అని చెప్పింది. పెద్దవెంకమరాజు తల్లికూడా ప్రగాఢమైన విశ్వాసంతో అందుకు అంగీకరించింది.

ప్రసవమునకు పూర్వం ఒక విశిష్టమైన సంఘటన జరిగింది. ఆరోజుల్లో ఈ పుట్టపర్తి చాలా చిన్నపల్లె. నాలుగిండ్ల మధ్యలో ఒక చేదబావి ఉండేది. ఒకనాడు ఈశ్వరమ్మ ఆ బావినుండి నీరు చేదుకొని తీసుకొని వెళుతున్నది. అప్పుడు ఆకాశంలో ఏదో మెరుపు మెరిసినట్లయింది. గాలి వీచింది. ఆ దివ్య తేజో పుంజము ఈశ్వరమ్మ గర్భములో ప్రవేశించింది. అప్పుడే ఇంటినుండి బయటికి వచ్చిన సుబ్బమ్మకూడా ఆ దృశ్యాన్ని చూసింది. "ఆకాశమునుండి ఏమిటో ఒక వెలుగు నీ గర్భములో ప్రవేశించినట్లుగా నాకు కనిపించిందమ్మా,' అని ఈశ్వరమ్మతో చెప్పింది. ఈవిషయాన్ని ఈనాటివరకు నేను ఎవరికీ చెప్పలేదు. అవతారతత్త్వము ఇంత పరిశుద్ధంగా, ఇంత గొప్పగా ఉంటుందని అందరూ

sri sathyasai vachanamrutam

తెలుసుకొనే నిమిత్తమై ఈనాడు ఈవిషయాన్ని నేను వెల్లడి చేస్తున్నాను.

ప్రసవమునకు ముందురోజు సాయంకాలం పెద్ద వెంకమరాజు కరణం సుబ్బమ్మ యింటిముందునుండి వెళుతున్నాడు. సుబ్బమ్మ ఆయనను లోపలికి పిలిచి, "వెంకమరాజూ! మీకు పుట్టబోయే కుమారునికి 'సత్యనారాయణ' అని పేరు పెట్టు," అని చెప్పింది. ఆయన, "ఇదంతా స్త్రీల మూర్ఖపు పట్టుదల," అనుకొన్నాడు. సరే! మరునాడు తెల్లవారుజామున సుముహూర్తమునందు ఈశ్వరమ్మకు కుమారుడు పుట్టాడు. పుట్టిన తక్షణమే ఏడ్వడము పిల్లలకు సహజం. కాని, ఈ పిల్లవాడు మాత్రం ఏడ్వలేదు. అది గమనించి చుట్టూ ఉన్న ఆడవారు, "ఈ పిల్లవాడు ప్రాణము లేనట్లు పుట్టాడే," అని కంగారుపడ్డారు. వాళ్ళ మాటలు విన్న ఈశ్వరమ్మకు కూడా భయం కలిగింది. ఎవ్వరూ చూడకుండా బిడ్డను గట్టిగా గిల్లింది, ప్రాణముంటే ఏడుస్తాడు కదా అని. ఆ పిల్లవాడు ఏడ్వటానికి బదులు నవ్వాడు. పురిటిబిడ్డ! అప్పటికింకా గంటకూడా కాలేదు! ఆ బిడ్డ నవ్వటమనేది ఎంత ఆశ్చర్యము! ఇంతలో కరణం సుబ్బమ్మ వచ్చి, "ఈశ్వరమ్మా! సుముహూర్తంలో నీకు కుమారుడు పుట్టినట్లు విన్నాను; చూడాలని వచ్చాను," అన్నది. సుబ్బమ్మ బ్రాహ్మణ స్త్రీ. ఆనాటి బ్రాహ్మణ స్త్రీలు ఎక్కువగా మడి, ఆచారములను పాటించేవారు. అందువలన, ఈశ్వరమ్మ తన బిడ్డను ఒక బట్టపై ఉంచి సుబ్బమ్మకు కాస్త దూరంగా పెట్టింది. ఇంతలో అత్తగారు వచ్చి, "ఏమి ఈశ్వరమ్మా! సుబ్బమ్మ ఎంతో ప్రేమతో చూడాలని వస్తే నీ బిడ్డను ఆమెకు దూరంగా పెడుతున్నావే! ఆమె చేతికి అందించు," అన్నది. దానికి ఈశ్వరమ్మ, "అత్తా! పురిటిబిడ్డను ఆమె ముట్టదేమోనని అలా దూరంగా పెట్టాను," అని చెప్పింది. నిజానికి సుబ్బమ్మకు అలాంటి భేదాలు ఉండేవి కావు.

ఈ పిల్లవాడు శుక్లపక్షచంద్రునివలె దినదిన ప్రవర్ధమానుడవుతూ వచ్చాడు. అయితే, అతని పద్ధతి కొంచెం వింతగా ఉండేది. ఎవ్వరితోనూ మాట్లాడేవాడు కాదు – మితభాషి, మితాహారి. తల్లి ఈశ్వరమ్మ చాలా ఆశ్చర్యపడుతూ వచ్చింది. సాధారణంగా పిల్లలు తిండికి వెంపర్లాడుతూ ఉంటారు. ఏదైనా తినుబండారము కనిపిస్తే చేయి జాపుతుంటారు. కాని, ఈ పిల్లవానికి తిండిపై ఏమాత్రం ధ్యాస లేదు. మాంసాహారమును దగ్గరకుకూడా రానిచ్చేవాడు

srisathyasaivachanamrutam

కాదు. మాంసాహారము భుజించేవాళ్ళ ఇంటికి తాను వెళ్ళేవాడు కాదు. భగవత్ప్రసాదమువలన కలిగిన వాడు కనుక ఇటువంటి పదార్థములను ఇష్టపడడని గుర్తించింది ఈశ్వరమ్మ. తల్లికి తాళం వేస్తూ వచ్చింది, పెద్ద బిడ్డ వెంకమ్మ. వీరిరువురూ కలిసి ఈ పిల్లవానిని అల్లారుముద్దుగా పెంచుతూ, నిరంతరము దైవసంబంధమైన పాటలు పాడుతూ ఉండేవారు. ఇలాంటి పవిత్రవాతావరణంలో ఈ బిడ్డ పెరుగుతూ వచ్చాడు.

కొంతకాలానికి ఈ ఉమ్మడి కుటుంబంలో అన్నదమ్ములమధ్య అభిప్రాయ భేదాలు తలెత్తినాయి. పెద్ద వెంకమరాజు, చిన్న వెంకమరాజు, వెంకట్రామరాజు, వెంకటసుబ్బరాజు అని నల్గురు అన్నదమ్ములు. వాళ్ళు వేరువేరుగా ఉండాలని నిర్ణయించుకున్నారు. సరే! కొండమరాజు వారికి తన ఆస్తిని సమానంగా పంచి ఇచ్చాడు. 'నాన్నా! మీరెక్కడుంటారు?' అని అడుగగా కొండమరాజు, 'నాయనా! నాకు ఎవ్వరూ అక్కరలేదు. సత్యం నా వెంట ఉంటే చాలు,' అన్నాడు. కుటుంబంలో నన్ను 'సత్యనారాయణ' అని పూర్తిపేరు పెట్టి పిలిచేవారు కాదు. అందరూ 'సత్యం, సత్యం' అని పిలిచేవారు. ఆయన నన్ను తనదగ్గరే పెట్టుకున్నాడు. నేను ఆయనకు సేవలు చేస్తూ వచ్చాను.

**ఈశ్వరుని అమ్మ ఈశ్వరమ్మ**

ఈశ్వరమ్మకు ఆమె తల్లిదండ్రులు పెట్టినపేరు నామగిరమ్మ. నా దివ్యత్వాన్ని గుర్తించిన కొండమరాజు ఆమె పేరును ఈశ్వరమ్మగా మార్చవలసిందని పెద్ద వెంకమరాజుకు సూచించాడు. ఆమె ఈశ్వరుని అమ్మ కాబట్టి ఈశ్వరమ్మ అనేదే ఆమెకు సరియైన పేరని ఆయన భావించాడు. ఒకరోజున వెంకమ్మను పిలిచి, 'మనవాళ్ళందరూ అమాయకులుగా, అజ్ఞానులుగా జీవితము గడిపేస్తున్నారు. సత్యంయొక్క శక్తిని ఎవరూ గుర్తించడంలేదు. ఇతను సాక్షాత్తు భగవత్స్వరూపునిగా కనిపిస్తున్నాడు. ఆకలి అని చెప్పడు. నిద్ర అని చెప్పడు. ఆకలిదప్పులు లేకుండా, నిద్రాహారములు లేకుండా కాలం గడుపుతున్నాడు,' అని చెప్పాడు. నేను రాత్రి పండుకున్నప్పుడు ఆయనకు 'సోఽహం... సోఽహం...' అనే శబ్దం వినిపించేది. ఆయన లేచి నెమ్మదిగా దగ్గరకు వచ్చి నా ముక్కుదగ్గర వ్రేలుపెట్టి శ్వాస ఆడుతున్నదా, లేదా అని చూచేవాడు. "సోఽహం, సోఽహం అని వినిపిస్తున్నది గాని, శ్వాస ఆడుతున్నట్లు మాత్రం కనిపించటంలేదే!" అని ఆశ్చర్యపోయేవాడు.

sri sathyasai vachanamrutam

దినదినానికీ పెరుగుతూ వచ్చింది ఈ మహాత్మ్యం. కొద్దిరోజులలోనే కొండమ రాజు ఇంటికి జనం గుంపులు గుంపులుగా రావటం మొదలుపెట్టారు. ఎందుకని ఎవరైనా ప్రశ్నిస్తే, 'కొండమరాజు ఇంట్లో ఆయన మనుమడున్నాడు. ఆ పిల్లవానిలో గొప్ప దైవశక్తి ఉన్నది. మాకు కలలో కనిపించాడు, మా సమస్యలను తీర్చాడు,' అని చెప్పేవారు.

ఇంతలో సెలవులకు శేషమరాజు పుట్టపర్తికి వచ్చాడు. ఈవిధంగా ప్రజలు తండోపతండాలుగా రావటం ఆయనకు నచ్చలేదు. ఆరోజుల్లో చదువుకున్న వారిని చూస్తే అందరూ గొప్పగా గౌరవించేవారు. శేషమరాజు టీచరు ట్రైనింగు పూర్తిచేయడంచేత ఆయనను గొప్ప చదువరిగా భావించి గౌరవించేవారు పల్లెప్రజలు. ఆయన వచ్చి కొండమరాజుతో వాదించి, "తాతా! ఈ అబ్బాయి దగ్గరకు ఎవ్వరినీ చేరనివ్వకు. ఇది దైవశక్తి కాదు, ఇంకే శక్తీ కాదు. ఇదేదో 'హిస్టీరియా' (గాలిచేష్ట) మాదిరి కనిపిస్తున్నది. కాబట్టి మన ఇంటికి ఎవ్వరూ రాకుండా చూసుకో," అని చెప్పాడు. తరువాత పెద్దవెంకమరాజును ఒప్పించి నన్ను చదువు నిమిత్తం ఉరవకొండకు తీసుకొని వెళ్ళాడు.

ఉరవకొండలో కూడా 'సత్యం' యొక్క ప్రభావము దినదినమునకూ పెరుగుతూ వచ్చింది. ప్రతి రోజూ అనేకమంది నన్ను చూడడానికి వచ్చేవారు. ఇంక, శేషమరాజు నన్ను తనదగ్గర పెట్టుకోవటం సాధ్యం కాదని తండ్రికి ఒక జాబు వ్రాశాడు: 'సత్యంను పట్టుకోవటం మాకు చేతకాదు. నీవు తక్షణమే వచ్చి వీనిని తీసుకొని వెళ్ళవలసింది,' అని. ఆరోజుల్లో జాబులు ఒకచోటునుండి మరో చోటుకు పోవటం చాలా కష్టంగా ఉండేది. పెద్దవెంకమరాజు ఒక సోమవారము రోజున సంతకని బుక్కపట్టణం వెళ్ళాడు. అక్కడ శేషమరాజు పంపిన జాబు అందుకొని సంతనుంచి నేరుగా ఉరవకొండకు వచ్చాడు పాపం! జేబులో నయాపైసా లేదు. శేషమరాజు దగ్గరనుండి బస్సు ఛార్జీ యిప్పించుకొని నన్ను బస్సులో కూర్చోబెట్టుకొని ఉరవకొండనుండి బయలుదేరాడు. బుక్కపట్టణం వరకు వస్తుంది బస్సు. అక్కడినుండి పుట్టపర్తికి నడుచుకుంటూ రావాలి. పెద్ద వెంకమ రాజు నా చేయి పట్టుకొని కష్టపడి నడిపించుకొని తీసుకువచ్చాడు.

ఇంటిదగ్గర కొండమరాజు ఉన్నాడు. ఆయనకు దేవుడన్నా, దేవతలన్నా చాలా నమ్మకము. "వెంకప్పా! వీనిని ఏమీ అనకు. వీని ధోరణి దైవచింతనకు సంబంధించినదిగా

srisathyasaivachanamrutam

కనిపిస్తున్నది. వీనిని కొన్ని రోజులు నాదగ్గర పెట్టుకుంటాను," అని చెప్పి ఆయన నన్ను తనదగ్గర పెట్టుకొని జాగ్రత్తగా చూచుకుంటూ వచ్చాడు. ప్రొద్దున్న, సాయంకాలము వెంకమ్మ మాత్రం వచ్చేది. 'సత్యా! నీకేమైనా కలలు వస్తుంటాయా? నీకెవరైనా కనిపిస్తుంటారా?' అని అడిగేది. నేను ఎవరికీ ఏమీ చెప్పేవాడను కాను.

కొందరు, "సత్యంకి దయ్యం పట్టింది, పిచ్చి బాగా ముదిరిపోయింది. ఇంక, బాగు చేయటం సాధ్యం కాదు," అన్నారు. "కదిరిదగ్గర భూతవైద్యుడున్నాడు. అతని దగ్గరకు తీసుకుపొండి," అని ఎవరో సలహా ఇచ్చారు. అప్పుడు నన్ను, వెంకమ్మను బండిలో కూర్చోబెట్టుకొని కదిరికి తీసుకొని వెళ్ళారు. వెంకమ్మ ఒక్క నిమిషంకూడా నన్ను విడిచి ఉండేది కాదు. ఆ భూతవైద్యుడు ఒక పెద్ద త్రాగుబోతు. "ఈ పిల్లవానికి దయ్యం పట్టింది. నేను ఈ దయ్యాన్ని వదిలిస్తాను," అని చెప్పి నన్ను గట్టిగా కొట్టాడు. దేహమంతా గండ్లుపడ్డాయి. నేనేమీ మాట్లాడలేదు. తరువాత మిక్కిలి బాధాకరమైన కలికము తెచ్చి వేశాడు. కన్నులు ఎరుపెక్కి విపరీతంగా వాచిపోయినాయి. కన్నుల మంటకు తట్టుకోలేక నేను తనకి లొంగిపోతానేమోనని భావించాడు. కాని, ఆవిధంగా జరగలేదు. ఆరోజు సాయంకాలం నేను వెంకమ్మ దగ్గరకు వచ్చి నా కంట్లో పేడరసము పోయమని చెప్పాను. మరునాడు కన్నులు మామూలుగా తెల్లగా అయిపోయాయి. ఇంక లాభం లేదని నా నెత్తిని నున్నగా గొరిగించి, రక్తము కారేటట్లు కత్తితో గాట్లు పెట్టి, వాటిపై పది అడుగుల ఎత్తునుండి కడవల కొలదీ నీరు పోశాడు. తరువాత నిమ్మకాయలు కోసి తలపైన బాగా రుద్దుతూ వచ్చాడు. ఇక ఈ బాధలు చూడలేక వెంకమ్మ రాత్రికిరాత్రి ఒక బండివానిని మాట్లాడుకొని నన్ను పుట్టపర్తికి తీసుకొని వచ్చేసింది.

**విరూపాక్షాలయంలో....**

ఈ పల్లెలో చదువుకోవడానికి అవకాశం లేదని శేషమరాజు నన్ను మళ్ళీ ఉరవకొండకు తీసుకొనిపోయాడు. ఆయన స్నేహితుడు రామరాజు (బళ్ళారి మున్సిపల్ కమీషనర్) సెలవులలో మమ్మల్ని హంపీలోని విరూపాక్షాలయానికి తీసుకొని వెళ్ళాడు. అక్కడికి వెళ్ళిన తరువాత నేను లోపలికి రానని పట్టుబట్టాను. అప్పుడు శేషమరాజు, "మేము లోపలికి వెళ్ళి విరూపాక్షుని దర్శించుకొని వస్తాము. నీవు ఇక్కడే మన సామానుదగ్గర ఉండు", అని

srisatyasaivachanamrutam

చెప్పాడు. వాళ్ళు ఆలయంలోకి వెళ్ళారు. గర్భగుడిలో మంగళహారతి ఇస్తుంటే అక్కడ విరూపాక్షునికి బదులు వారికి సత్యం కనిపించాడు. శేషమరాజుకు కోపం వచ్చింది. "వీడిని బయట సామానుదగ్గర ఉండమని చెప్పాను కదా! ఇక్కడికెందుకు వచ్చాడు? గర్భగుడిలోకి ప్రవేశించడం పద్ధతి కాదుకదా," అనుకొన్నాడు. తక్షణమే బయటికి వచ్చి చూశాడు. ఆశ్చర్యకరంగా ఆ సామాను దగ్గర సత్యమే కూర్చొని ఉన్నాడు. విరూపాక్ష దేవాలయము లోపల, బయటకూడా సత్యమే కనిపిస్తున్నాడు. "ఇది కలనా, లేక నా భ్రమనా," అని శేషమరాజు ఆశ్చర్య పోయాడు. కాని, అనుమానం తీరక భార్యతో, "నీవు బయటికి వెళ్ళి సత్యందగ్గర కాపలా ఉండు. వాడిని ఎక్కడికీ కదలనివ్వకు," అని చెప్పి తాను మళ్ళీ లోపలికి వెళ్ళాడు. అక్కడ చిరునవ్వులు చిందిస్తూ నేను మళ్ళీ కనిపించాను.

ఆ సమయంలో రామరాజుకు నా తలచుట్టూ ఒక దివ్యతేజస్సు కనిపించింది. అయితే, అతను ఈవిషయం ఎవరితోనూ చెప్పలేదు. అసలు శేషమరాజుకు మొదటినుండి ఇవన్నీ అంటే చాలా అనుమానాలు. కనుక, శేషమరాజుకు ఈవిషయం చెప్పకూడదని రామరాజు, ఆయన భార్య నిర్ణయించుకున్నారు. సెలవులు అయిన తరువాత మేము ఉరవకొండకు తిరిగి వచ్చేముందు రామరాజు నాకొరకు ఒక నిక్కరు, ఒక షర్టు తీసుకొని వచ్చాడు. కాని, నేను వాటిని స్వీకరించక పొట్లం కట్టి వాళ్ళింట్లోనే పెట్టాను. ఆనాటి పిల్లలందరికీ కాలరు పిన్ను అంటే చాలా ఇష్టము. శ్రీమంతుల పిల్లలు బంగారు కాలరుపిన్ను ధరించేవారు. నేను బట్టలు తీసుకోలేదని, రామరాజు నా షర్టుకు ఒక బంగారు కాలరుపిన్ను వేశాడు. నేను ఉరవకొండకు తిరిగి వచ్చిన తరువాత పుస్తకాలు పట్టుకొని స్కూలుకు వెళుతున్నాను. దారిలో ఉన్నట్టుండి కాలరుపిన్ను జారి పడిపోయింది. తక్షణమే యింటికి వచ్చి పుస్తకాలు పారవేశాను.

**నేను సాయిని తెలియుము నిక్కముగను**
**మమత బాయుము యత్నముల్ మానుకొనుము**
**బాసె నాకు మీతోటి బాహ్యసంబంధమింక**
**కాదు నన్నపట్ట ఎటువంటి ఘనునకైన**

అని ఒక పద్యం చెప్పాను. శేషమరాజుకూడా కవిత్వం వ్రాసేవాడు. ఆ సమయంలో ఆయన

sri sathyasaivachanamrutam

ఇంటివద్ద లేదు. జరిగిన సంగతి తరువాత తన భార్యద్వారా తెలుసుకొని, "ఎవరో వీనిచేత ఈవిధంగా చెప్పించారు. లేకపోతే, వీనికి ఇంత కవిత్వం వస్తుందా!" అన్నాడు. ఎక్సైజు ఇన్స్పెక్టర్ ఆంజనేయులుకు, ఆయన పిల్లలకు కూడా నేనంటే చాలా అభిమానము. నేను స్కూలుకు పోలేదని తెలిసి ఆయన కారులో వచ్చి నన్ను తీసుకు వెళ్ళాడు. "బాబూ! నీకెందుకు కలిగింది ఈ వైరాగ్యము? ఇంట్లో వదినగాని, అన్నగాని నిన్ను తిట్టారా? ఏమిటి కారణం?" అని నన్ను ఎంతగానో అడిగాడు. అక్కడ కూడా కవిత్వం చెప్పాను.

ప్రాపంచిక సంబంధము పిన్నై తొలగెన్
క్షేత్రదర్శనము కూడా చెల్లెను హంపిన్
మాయ తొలగెనని బాబా గృహమును వీడెన్

ప్రాపంచిక సంబంధం ఒక చిన్న పిన్నువంటిది. ఆ పిన్నును నేను తొలగించుకున్నాను. ఇక ఇంటిలో ఉండనని బయలుదేరాను. కాని, ఎవరింటికీ నేను పోలేదు. ఆంజనేయులు ఇంటిలోకి కూడా నేను ప్రవేశించలేదు. వారింటి ముందు ఒక పెద్ద రాయి (గుండు) ఉండేది. దానిపై కూర్చున్నాను. "ఏమిటి? ఈ పిల్లవానిలో ఈవిధమైన మార్పు కలిగిందే," అని అందరూ ఆశ్చర్యపడ్డారు. సాయంకాలము శేషమరాజు స్కూలునుండి తిరిగి వెళుతూ నన్ను తనవెంట ఇంటికి తీసుకువెళ్ళాలని ఎంతగానో ప్రయత్నం చేశాడు. నేను రానని కచ్చితంగా చెప్పాను. అప్పుడు ఆంజనేయులు, "నాయనా! ఈ పిల్లవానిని హింసించకండి, ఇక్కడే ఉండనీయండి. శాంతపడిన తరువాత నేనే తీసుకొని వస్తాను," అని చెప్పాడు. ఎవరెవరో అక్కడికి వచ్చి నన్ను అనేకరకాలుగా ప్రశ్నిస్తూవచ్చారు. "ఎవరు నీవు? దయ్యానివా? భూతానివా?" అని అడిగారు. "నేను భూతాన్ని కాను, పిశాచాన్ని కాను. నేను సాయిని తెలియుము నిక్కముగను," అని స్పష్టంగా చెప్పాను. "నీవు సాయిబాబావని మేము ఎట్లా నమ్మేది?" అని ప్రశ్నించారు. అప్పట్లో 'సాయిబాబా' అనే పేరు ఈ ప్రాంతంలో ఎవ్వరూ వినలేదు; అనంతపురం జిల్లాలోనే సాయిబాబా పేరు ఎవరికీ తెలియదు. అప్పుడు నేను ఎవరో తెచ్చిన పూలను చేతిలోకి తీసుకొని నేలపై చల్లాను. ఆ పూలు ఒకదానివెంట ఒకటి "సాయిబాబా" అనే అక్షరాలుగా ఏర్పడ్డాయి. నేను అక్కడ కూర్చొని ఉండగా ఒక ఫోటోగ్రాఫరు వచ్చి ఫోటో తీశాడు. ఆ ఫోటోలో నా ముందున్న ఒక చిన్నరాయి సాయిబాబా

srisathyasaivachanamrutam

విగ్రహంగా కనిపించింది. ఆ ఫోటోలను అందరికీ పంచిపెట్టారు. ఆనాడు నేను కూర్చున్న గుండు నేటికి కూడా ఉరవకొండలో ఉన్నది. ఇప్పుడు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సత్యసాయి సేవాసంస్థ ప్రెసిడెంటు అంజనయ్య దానిపైన ఒక గొప్ప మందిరము, హాలు కట్టించాడు.

నా ఖ్యాతి దినదినాభివృద్ధి అవుతూ వచ్చింది. ఆ చుట్టుప్రక్కల పల్లెలవారు అనేకమంది బండ్లుకట్టుకొని ఇక్కడికి వచ్చేవారు. "ఈ పిల్లవాడు పొమ్మంటే పోతాయి దయ్యాలు," అనే విశ్వాసంతో అనేకమంది పిచ్చి వాళ్ళను; దయ్యాలు, భూతాలు పట్టినవాళ్ళను కూడా తీసుకువచ్చేవారు. వారి నమ్మకమునకు తగినట్లు దయ్యాలు, భూతాలు వారిని వదలిపోయేవి. అప్పుడు నేను చెప్పేది సత్యమని అనేకమంది నమ్మినారు. వెంకమ్మకు సాయిబాబా అంటే చాలా నమ్మకము ఏర్పడింది. 'సత్యా! నాకు సాయిబాబా ఫోటో కావాలి,' అని నన్ను అడిగింది. నేను సాయిబాబా ఫొటో ఒకటి సృష్టించి యిచ్చాను. ఆ ఫోటోను వెంకమ్మ తాను చనిపోయేంతవరకు తన దగ్గరనే పెట్టుకుంది.

**కరణం సుబ్బమ్మ భక్తిప్రపత్తులు**

ఈ సాయి మహాత్మ్యం దినదిన ప్రవర్ధమానమౌతూ వచ్చింది. ప్రతి దినము వందలాది భక్తులు వచ్చేవారు. వారికి తగిన సదుపాయాలు చేయటం ఇంట్లోని వారికి సాధ్యం కాలేదు. అప్పుడు పెద్ద వెంకమరాజు భక్తులతో, 'ఒక్క బేస్తవారం (గురువారం) మాత్రమే రండి,' అని చెప్పాడు. వారు చాలా ఆందోళన చెంది, "మేము బేస్తవారం వరకు ఎట్లా కాచుకొని వుండేది? మా రోగాలు ఎక్కువై పోతాయి," అన్నారు. అప్పుడు సుబ్బమ్మ, "వెంకప్పా! నీ ఇంటిలో ఈ అబ్బాయిని పెట్టుకొని ఉండలేవు; మా ఇంటికి పంపించు. నేను అన్నివిధాలుగా చూచుకుంటాను. వచ్చిపోయే భక్తులకు భోజనము కూడా నేనే ఏర్పాటు చేస్తాను," అన్నది. సుబ్బమ్మది బ్రాహ్మణకులము, ఈ సాయిబాబాది క్షత్రియకులము. ఫలితంగా గ్రామంలోని బ్రాహ్మణులందరూ, "ఈమె సాయిబాబాను ఇంట్లో పెట్టుకున్నది. కనుక, ఈమె ఇంటికి మనం పోకూడదు," అని నిర్ణయించుకున్నారు. 'నాకు ఎవ్వరూ అవసరం లేదు. నేను ఎవరిదగ్గరికీ పోనక్కరలేదు. మీరు ఏమైనా చేసుకోండి, ఈ అబ్బాయిని మాత్రం నేను వదలను,' అని ఆమె ఖండితంగా వారికి బదులు చెప్పింది. పల్లెలో ఉన్న హరిజనులకు

srisathyasaivachanamrutam

స్వామి అంటే చాలా ప్రీతి. వాళ్ళు అప్పుడప్పుడు స్వామిని తమ ఇంటికి తీసుకొనిపోతూ వచ్చారు. సుబ్బమ్మకూడా నాతోపాటు ఆ హరిజనుల ఇళ్ళకు వచ్చేది. స్వామిని విడిచి ఒక్క క్షణమైనా ఉండడానికి ఆమె ఇష్టపడేది కాదు. స్వామిని తన స్వంతబిడ్డమాదిరి చూచుకుంటూ వచ్చింది. దానితో బ్రాహ్మణులందరూ ఆమెపై ద్వేషం పెంచుకున్నారు. కట్టకడపటికి ఆమె తల్లి, తమ్ముడుకూడా ఆమెపై ద్వేషం పూనారు. కాని, సుబ్బమ్మ ఏమాత్రము చలించలేదు. దైవసంబంధమైన విషయాల్లో ఇలాంటి ఆటంకములను ఎదుర్కొనక తప్పదని ఆమెకు తెలుసు.

'ఈ సుబ్బమ్మ బ్రాహ్మణకులాన్ని నాశనం చేసి పెడుతున్నది,' అని కొందరికి కోపం వచ్చింది. నాకు విషం పెట్టాలని ఒకనాడు వారు నన్ను భోజనానికి పిలిచారు. సుబ్బమ్మ వారింటికి పోవద్దని చెప్పింది. కాని, నేను వెళ్ళాను. వడలంటే నాకు చాలా ఇష్టం. కాబట్టి, వడలు చేసి కొన్నింటిలో విషం కలిపి నాకు పెట్టారు. నేను విషం కలిపిన వడలను మాత్రమే తిని విషం లేని వడలను వదలిపెట్టాను. నాకు ఏవిధమైన ప్రమాదమూ జరగలేదు. ఈ సంగతి ఊర్లో అందరికీ తెలిసిపోయింది.

అచిరకాలంలోనే కరణం సుబ్బమ్మ ఇల్లుకూడా పట్టనంతగా జనం వచ్చారు. అది చూచి వెంకమరాజు, 'అమ్మా! మావలన మీకు ఈ అసౌకర్యమెందుకు? ఇక మీదట సత్యంను వేరుగా ఒక యింటిలో ఉంచుదాం,' అన్నాడు. అప్పుడు సుబ్బమ్మ వేణుగోపాలస్వామి గుడి ప్రక్కన కొంత భూమి ఇచ్చింది. అక్కడ నాకోసం ఒక చిన్న గది కట్టించారు. అందుకు సుబ్బమ్మ సహాయం చేసింది. నన్ను ఆ గదిలో ఉంచి తలుపులకు తాళం వేసేవారు. అయినా నేను ఎట్లాగో తప్పించుకొని కొండపైకి వెళ్ళి కూర్చొనేవాడిని. "తాళం చూస్తే వేసినది వేసినట్లుగానే ఉంటున్నది. మరి ఈ పిల్లవాడు బయటకు ఎట్లా వచ్చాడు?" అని అందరూ ఆశ్చర్యపోయేవారు. ఈవిధమైన అద్భుతాలు దినదినానికి అనేకం జరుగుతూ వచ్చాయి.

ఒకనాటి రాత్రి కొందరు నేనుండే గదికి బీగం వేసి నిప్పు పెట్టారు. ఆ గది వరిగడ్డితో కప్పబడడంచేత పెద్దమంటలు రగుల్కొన్నాయి. లోపల ఉన్న సాయిబాబా ఏమైనాడోనని చాలామంది భయపడుతూ పరుగెత్తి వచ్చారు. వెంకమ్మ, సుబ్బమ్మ, ఈశ్వరమ్మ అందరూ ఏడ్చుకుంటూ వచ్చారు. కొంతసేపటికి పెద్ద వర్షం కురిసింది. ఐతే, ఆశ్చర్యంగా ఆ

sri sathyasai vachanamrutam

ఇంటిపైన మాత్రమే కురిసింది. మంటలు ఆరిపోయాయి. స్వామి క్షేమంగా ఉండడం చూసి వాళ్ళంతా ఊపిరి పీల్చుకున్నారు. 'ఏ దుర్మార్గులో, ఏ దుష్టులో ఈవిధంగా చేయరాని పనులు చేస్తున్నారు,' అని బాధపడ్డారు. అప్పుడు సుబ్బమ్మ ఆ గదికి వేసిన బీగమును పగలగొట్టి నన్ను తన ఇంటికి తీసుకుపోయింది.

ఇలా అనేకరకములైన పరీక్షలకు నేను తట్టుకొని నిలబడిన తరువాతనే అందరూ నన్ను 'సాయిబాబా' అని నమ్ముతూ వచ్చారు. ఈవిధంగా జరుగుతూ ఉండగా పెనుగొండలో ఒకడు తాను సాయిబాబా భక్తుడనని బయలుదేరాడు. మరికొందరు నా మాదిరే జుట్టు పెంచుకొని, నా మాదిరే గౌను వేసుకొని, 'నేను సాయిబాబాను,' అని చెప్పుకుంటూ వచ్చారు. పేరు పెట్టుకున్నంత మాత్రమున అది నెగ్గుతుందా? వాళ్ళు చేస్తున్నదంతా మోసమని ప్రజలు గుర్తించారు. సత్యాన్ని తెలుసుకున్నారు.

**'నేను పుట్టపర్తిని వదలిపెట్టను'**

బెంగుళూరువంటి దూరప్రదేశాలనుండి భక్తులు వచ్చి నన్ను వారివెంట రావలసిందిగా ప్రార్థించేవారు. ఒకనాడు ఈశ్వరమ్మ, వెంకమ్మ నావద్దకు వచ్చి, 'స్వామీ, మీరు ఎక్కడికైనా వెళ్ళండికాని, పుట్టపర్తిని మాత్రం వదలిపెట్టకండి,' అని ప్రాధేయపడ్డారు. 'ఎట్టి పరిస్థితిలోనూ నేను పుట్టపర్తిని వదలిపెట్టను, ఇక్కడే ఉంటాను,' అని నేను వాగ్దానం చేశాను.

క్రమంగా మైసూరు మహారాణి, ఇంకా కొందరు పెద్దలు కార్లు వేసుకొని పుట్టపర్తికి రావటం మొదలుపెట్టారు. అప్పట్లో చిత్రావతినది నిత్యం ప్రవహించేటటువంటిది. వాళ్లు తమ కార్లను నదికి అవతల గట్టున నిలిపి, నదిని దాటి వచ్చేవారు. ఈవిధంగా భక్తి ప్రపత్తులు పెరుగుతూ వచ్చేటప్పటికి, ఇంక ఎవ్వరూ ఏవిధంగాను అడ్డుపెట్టడానికి వీలులేకుండాపోయింది.

స్వామి కీర్తి దూరప్రాంతాలకుకూడా ప్రాకింది. ఇదంతా మాతృమూర్తియొక్క ప్రభావమే అనే సత్యాన్ని అందరూ గుర్తించారు. అదేవిధంగా, ప్రతి మహనీయుని యొక్క ఉన్నతికి తల్లియే మూలకారణం. గుణవంతులైన తల్లులు తమ భక్తిప్రపత్తులచేత, పూజలచేత,

srisathyasaivachanamrutam

ప్రార్థనలచేత పిల్లలను మహనీయులుగా తీర్చిదిద్దుతూ వచ్చారు. వారికి చదువులు, డిగ్రీలు ఉండకపోవచ్చు. ఎట్టి చదువులూ లేని ఈశ్వరమ్మయొక్క సద్గుణములవల్లనే ఈ పుట్టపర్తి ఇంత గొప్ప పేరుప్రఖ్యాతులు పొందినది. కాని, ఈనాడు ఈశ్వరమ్మను మరచి ఈశ్వరమ్మ కన్న కుమారుని గొప్పగా పొగడుతున్నారు. ఈశ్వరమ్మ లేక ఈ గొప్ప శక్తి ఎక్కడినుండి వచ్చింది? కనుక, తల్లియొక్క కీర్తిని మీరు కాపాడుతూ రావాలి. మాతృమూర్తిని గౌరవించాలి. ఈవిధంగా జరుగుతూ వచ్చినది ఈ సత్యసాయియొక్క ప్రభావము.

ఈశ్వరమ్మకు ఆనాడు ప్రమాణం చేయటంవలన నేను ఈనాటివరకు పుట్టపర్తిని వదలలేదు. ఎవరైనా ఇక్కడకు రావలసిందేకాని, నేను ఇంకెక్కడా స్థిర నివాసము చేసేది లేదు. ఈనాడు అనేకమంది తాము పుట్టిన స్థానమును వదలిపెడుతున్నారు. పుట్టిన స్థానమును వదలకూడదు. అది ఈ అవతారము యొక్క తత్త్వము. ఇక్కడ ఉన్న చెట్టును పెరికి ఇంకొకచోట నాటితే అది ఎంతకాలం బ్రతుకుతుంది? 'సాయిబాబా' అనే ఈ మహావృక్షము ఎక్కడ పుట్టిందో అక్కడే పెరగాలి. ఈ పుట్టపర్తిని వదలకుండా నేను యిక్కడే ఉండటమువలన ఈ గ్రామము ఒక పెద్ద పుణ్యక్షేత్రంగా అభివృద్ధి చెందుతూ వచ్చింది.

అసలు ఈ గ్రామానికి 'పుట్టపర్తి' అని పేరు రావటానికి వెనుక ఒక విచిత్రమైన చరిత్ర ఉంది. ఇప్పుడు వేణుగోపాలస్వామి ఆలయం ఉన్నచోట పూర్వం ఒక చిన్న పుట్ట ఉండేది. ఆ పుట్టలో ఒక పాము నివసించేది. ఈ గ్రామంలో ఉండే గొల్లలు ప్రతి దినము తమ గోవులను మేపడానికి ఊరి బయటకు తీసుకొని పోయేవారు. ఒక ఆవు మాత్రం తప్పించుకొని ఆ పుట్టదగ్గరికి పోయేది. దాని పొదుగులోని పాలను పాము త్రాగేది. ఒకరోజున కొంతమంది గొల్లలు ఇది చూచి పుట్టదగ్గరికి పోయి ఆ పామును చంపాలని ప్రయత్నం చేశారు. పాలు త్రాగుతుంటే ఆ పామును పెద్దరాయితో కొట్టారు. అప్పుడా పాము, ఈ గ్రామంలో గొల్లలు కాని, గోవులుగాని బ్రతకటానికి వీలుండదని శాపమిచ్చింది. అందువల్లనే పుట్టపర్తిలో ఉన్న గొల్లలు గ్రామాన్ని వదలి దూరంగా ఉన్న గోకులంలో ఇళ్ళు కట్టుకున్నారు. గొల్లలు ఎవ్వరూ పుట్టపర్తిలో నిద్రచేసేవారు కాదు. సాయంకాలం అయ్యేటప్పటికి గోకులం వచ్చేసేవారు. ఆనాడు ఆ గొల్లలు పాముపై విసిరిన రాయే ఇప్పుడు వేణుగోపాలస్వామి ఆలయంలో

srisathyasaivachanamrutam

పూజలందుకుంటున్నది.

ముఖ్యంగా ఈనాడు సాయిబాబా కీర్తి జగద్వ్యాప్తి కావటానికి కారణము, పుట్టపర్తి అనే పేరు రావటానికి కారణము చెప్పాలని సంకల్పించి యిదంతా చెప్పాను. ఈ పుట్టపర్తికి యింత గొప్ప చరిత్ర ఉంది. ఇది ఏదో తమాషాకి పెట్టిన పేరు కాదు. ఇక్కడికి గొప్పగొప్పవారందరూ వచ్చారు. ఇక్కడ ఎంతోమంది పుణ్యాత్ములు నివసించి పుట్టపర్తియొక్క పేరుప్రతిష్ఠలను కాపాడుతూ వచ్చారు. ఆ రోజుల్లో మైసూరు మహారాజావారు వచ్చేవారు. ఆయన తల్లి సదాచార సంపన్నురాలు. ఆమె కర్నాటనాగేపల్లివద్ద కారుదిగి ఇక్కడికి నడచివచ్చేటటు వంటిది. ఈవిధంగా, అనేకమంది పెద్దలచేత గౌరవింపబడి, పూజింపబడినటు వంటిది ఈ పుట్టపర్తి.

**శ్రీ పుట్టపర్తి నిలయుడు**
**కాపాడును నిన్ను నెపుడు కరుణాకరుడై**
**చేపట్టి నిన్ను బ్రోచును**
**ఏ పట్టున మరువకుండ ఏలును నిన్నున్.**

ప్రేమస్వరూపులారా! మీరు నిజంగా పుణ్యాత్ములు, చాలా అదృష్టవంతులు. స్వామితో ఆడుతూ, పాడుతూ ఆనందంగా కాలం గడుపుకుంటూ వచ్చారు. మీతో సాయి, సాయితో మీరు. కనుకనే, I and you are one (మీరు, నేను ఒక్కటే) అని చెబుతూ వచ్చాను. దైవంయొక్క శక్తిసామర్థ్యములను ఎవ్వరూ వర్ణించలేరు. అవి అనంతమైనవి. కనుక, మీరు దైవవిశ్వాసమును పెంచుకోండి. విద్యార్థులారా! ఈ పుట్టపర్తి కళాశాలలో చేరినందుకు, ఇక్కడ ఉన్నతవిద్యను నేర్చుకున్నందుకు పుట్టపర్తి పేరుప్రతిష్ఠలను మీరు కాపాడుతూ రావాలి.

ఇక్కడ ఒక చిన్న విషయం మీకు చెబుతున్నాను. ఇక్కడ చదువుకోవడానికి వచ్చే పిల్లలు సెలవులిచ్చినా ఇళ్ళకి పోవడానికి ఇష్టపడరు. ఎం.బి.ఎ., ఎం.టెక్. వంటి గొప్పగొప్ప డిగ్రీలు పొందిన తరువాతకూడా 'స్వామీ! మేము యిక్కడే ఉండాలి,' అని ప్రార్థిస్తూ యిక్కడే ఉండటానికి ప్రయత్నం చేస్తుంటారు. దీనికి కారణమేమిటి? ఈ సత్యసాయిబాబా ఒక పెద్ద

sri sathyasai vachanamrutam

మేగ్నెట్! అందరినీ ఆకర్షించే గొప్ప మేగ్నెట్ దైవమే. దైవము అందరి హృదయాలను ఆకర్షిస్తుంటాడు. ఈ 'మేగ్నెట్' యొక్క దివ్యప్రభావము మీరు ముమ్ముందు చూడగలరు.

**'శతమానం భవతి...'**

(డా॥ అంజనయ్యగారిని చూపిస్తూ) ఆనాడు నేను ఉరవకొండలో రాతిపైన కూర్చొని మొట్టమొదటిసారి మానవాళికి ప్రబోధము చేసినచోట ఈయన ఒక మందిరము కట్టించాడు. తాను ఎం.ఎస్‌సి. పూర్తి చేసి, డాక్టరేట్ డిగ్రీ కూడా తీసుకున్నాడు. తన ఉద్యోగానికి రాజీనామా చేసి ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శ్రీ సత్యసాయి సేవాసంస్థల అధ్యక్షునిగా సేవచేస్తున్నాడు.

(ఒక వయోవృద్ధుని చూపిస్తూ) అతని మామ ఇతను. ఇతను ఉండేదికూడా అక్కడే. స్వామికోసమని నూరు ఎకరాల స్థలం తీసి అందులో రకరకాల ఫలవృక్షాలను పెంచి ఆ పండ్లన్నీ మన పిల్లలకోసం పుట్టపర్తికి పంపిస్తుంటాడు. ప్రస్తుతం ఈయనకు నూరు సంవత్సరములు నిండాయి.

ఒక ముఖ్యవిషయం మీకు యిక్కడ చెప్పాలి. ప్రశాంతినిలయంలో స్వామికి తమ జీవితాన్ని అంకితం చేసిన భక్తులు నూరు సంవత్సరాలు నిండనిదే వెళ్లిపోరు. "శతమానం భవతి శతాయుః పురుషః శతేంద్రియ ఆయుష్యేవేంద్రియే ప్రతితిష్ఠతి" కస్తూరి యిక్కడకు వచ్చాడు, పరిపూర్ణమైన జీవితాన్ని గడిపాడు. పూజారి కిష్టప్ప వచ్చాడు. ఆయనకూ నూరేళ్ళు పూర్తి నిండాయి. కామావధాని మీకు తెలుసు, గొప్ప వేదపండితుడు. ఆయన ఇక్కడికి వచ్చి తిరిగి వెనుకకు పోలేదు. 30 సంవత్సరములు ఇక్కడే ఉండిపోయాడు. ఒకదినం సీతారాముల కల్యాణోత్సవం జరిపించిన తరువాత తన రూముకి వెళుతూ, 'స్నానం చేసి తిరిగి వస్తాను స్వామీ!' అన్నాడు. 'నీవేమీ రానక్కరలేదు. స్నానం చేసి, భోజనం చేసి, హాయిగా పండుకో,' అని చెప్పాను. వెళ్ళి స్నానం చేశాడు. స్వామి ఆజ్ఞ మీరకూడదని భోజనం చేసి పండుకున్నాడు. అట్లే పోయాడు. ఆయన నిరంతరము సాయినామాన్ని స్మరించేవాడు. ఎప్పుడూ ఏ రోగమూ ఎరుగడు. ఏనాడూ జ్వరము కూడా రాలేదు. ఇంక సూరయ్యకూడా నూరేళ్ళు జీవించాడు. అతను నిత్యబ్రహ్మచారి, వెంకటగిరి రాజావారి దగ్గర

sri sathyasai vachanamrutam

ఉండేవాడు. ఇక్కడికి వచ్చి 30 సంవత్సరములు సేవచేశాడు. నూరు సంవత్సరాలు జీవించి ఒకనాడు పండుకున్నవాడు పండుకున్నట్లుగానే వెళ్ళాడు. దంతవైద్యుడు పద్మనాభన్ పెదనాన్న శేషగిరిరావు రిటైరై 63వ సంవత్సరములో యిక్కడికి వచ్చాడు; నూరు సంవత్సరములు నిండి ప్రశాంతంగా వెళ్ళిపోయాడు. వీరందరూ పరులచేత ఏమాత్రము సేవ చేయించుకోలేదు.

(గోపాల్‌రావుగారిని శ్రీవారు వేదికపైకి రప్పించి) ఈయన గొప్ప చదువరి, గొప్ప అధికారి; ఆంధ్రా బ్యాంకు ఛైర్మన్‌గా పనిచేశాడు. ఇప్పుడు ఈయనకి నూరవ సంవత్సరం వస్తున్నది. వయోభారాన్ని సైతం లెక్కచేయక క్యాంటీనుకి పోయి నీరు పోసి భక్తులకు సేవ చేస్తూ వచ్చాడు. తాను ఛైర్మన్‌గా ఉన్నప్పుడు బ్యాంకులో స్ట్రైకు జరిగింది. పెద్దపెద్దవారిని జైల్లో పెట్టారు. ఆసమయంలో ఇందిరాగాంధీ ఈయనకి టెలిగ్రాము పంపింది. నేను ఆనాడు వీరింటికి భోజనానికి వెళ్ళాను. 'గోపాల్‌రావూ! నీవు అనుసరించేది సత్యమార్గము. సత్యాన్ని వదలకుండా ఉండు,' అని చెప్పాను. నా ఆజ్ఞను శిరసావహించాడు. ఈయనని ఎవ్వరూ ఏమీ చేయలేకపోయారు. ఆంధ్రా బ్యాంకులో 60 సంవత్సరాలు పనిచేశాడు. ప్రస్తుతం మన ప్రశాంతినిలయంలో ఆనందంగా నామస్మరణ చేసుకుంటూ కాలం గడుపుతున్నాడు. "నీవు పరులచేత సేవ చేయించుకోకుండా పోతావు. ధైర్యంగా ఉండు," అని చెప్పాను. తానే ఇతరులకు ఎంతో సేవ చేస్తూ వచ్చాడు. ఈరకంగా ఎందరో భక్తులు చిరంజీవులుగా నిలిచారు. ఏది ఏమైనా, ఎప్పటికైనా దేహము పోక తప్పదు. అయితే, పరాధీనము కాకుండా పోవాలి.

**(తేదీ 23.11.2003, 78వ జన్మదినోత్సవ సందేశం, సాయికుల్వంత్ హాలు)**

sri sathyasai vacharamrutam